సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 15 । ఏప్రిల్ । 2024



ఇది ప్రజాస్వామ్యంపై దాడి

సీఎం వైఎస్ జగన్‌పై జరిగిన దాడిని నాయకులు ఖండించారు. నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. - 8లో



ముగిసిన టెక్న్ వెర్స్

ట్రిపుల్‌ఐటీలో మూడు రోజులు నిర్వహించిన టెక్న్ వెర్స్ ముగిసింది. విద్యార్థులు తమ ప్రాజెక్టులు ప్రదర్శించారు. - 8లో

17న అండర్-19 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా అండర్-19 బాలుర క్రికెట్ జట్టు ఎంపికలు ఈ నెల 17వ తేదీన నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష,కార్యదర్శులు పీవై ఎస్ శాస్త్రి, షేక్ హసన్ రాజా, మెంటార్ ఇలియాస్ మహ్మద్, కోశాధికారి కెఎస్ఎం శైలానీ తెలిపారు. ఆ రోజు బుధవారం ఉదయం 7 గంటలకు శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ(ఆర్ట్స్) కళాశాల మైదానంలోని క్రికెట్ నెట్స్ వద్దకు చేరుకోవాలని వారు పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

హిరమండలంపై నిప్పుల వాన



నిర్మానుష్యంగా మారిన హిరమండలం ప్రధాన రహదారి

హిరమండలం: మండల కేంద్రం ఆదివారం నిప్పుల కొలిమిని తలపించింది. మండలంలో ఆదివారం 42డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యమయ్యాయి. ఎండ తీవ్రతకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ బి.సుధాకర్ ఓ ప్రకటనలో కోరారు.

సముద్రంలోకి తాబేలు పిల్లలు



సంద్రంలోకి వెళ్తున్న ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలు

సోంపేట: మండలంలోని బారువ తీరంలో ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలను ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సముద్రంలోకి ఆదివారం విడిచిపెట్టారు. కార్యక్రమంలో అటవీశాఖ బారువ బీట్ ఆఫీసర్ టి.సంతోష్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యానికి అన్ని జీవులను రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఆలివ్ రిడ్లే తాబేళ్లను రక్షించాల్సిన అవసరం ప్రతి మత్స్యకారుడికి ఉందన్నారు. కార్యక్రమంలో కంటి వైద్యనిపుణులు డాక్టర్ షీలా, ట్రీ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ కె.సోమేశ్వరరావు, సంరక్షణ సభ్యులు తోటారావు, జి.చంద్రయ్య తదితరులు ఉన్నారు.


ఆదిత్యునికి విశేష పూజలు



భక్తులకు మజ్జిగను అందజేస్తున్న జేసీఐ ప్రతినిధులు, మండవిల్లి రవి, తదితరులు

అరసవల్లి: ఆదివారం ఉదయం నుంచి పగటి ఉష్ణోగ్రత 40కి పైగా నమోదైనప్పటికీ భానుని ప్రతాపాన్ని సైతం లెక్క చేయకుండా భక్తులు ఆదిత్యుడిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అంతరాలయంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అద్భుత అలంకరణలో ఆదిత్యుని సర్వదర్శనాలకు అనుమతించారు. భక్తులకు ఎండ వేడిమి నుంచి రక్షణగా మంచినీటిని, మజ్జిగను, చిన్నారులకు పాలు,బిస్కెట్లను ఆలయం తరపున ఈఓ ఎస్.చంద్రశేఖర్ పంపిణీ చేయించారు. అన్నదాన ప్రసాదాలను సుమారు 800 మందికి అందించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని జేసీఐ-శ్రీకాకుళం గ్రీన్‌సిటీ అధ్యక్షులు బి.వరలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ పాలకమండలి సభ్యుడు మండవిల్లి రవి, జేసీఐ సభ్యులు కె.ఉషారాణి, పి.మధుబాబు, కె.గీత, టి.ఉషారాణి తదితరులంతా ఉచితంగా మజ్జిగను పంపిణీ చేశారు.

'సమన్వయంతో పనిచేద్దాం'



ఆంధ్రా-ఒడిశా రెవెన్యూ, పోలీస్ అధికారుల సమీక్ష సమావేశం

ఇచ్ఛాపురం రూరల్: త్వరలో జరగనున్న ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇరు రాష్ట్రాల అధికారులం సమన్వయంతో పనిచేద్దామని బరంపురం సబ్ కలెక్టర్ దీనా దస్తగిరి అన్నారు. ఎస్పీ జీఆర్ రాధిక ఆదేశాల మేరకు ఆదివారం బరంపురం కలెక్టర్ బంగ్లాలో ఇరు రాష్ట్రాలకు చెందిన రెవెన్యూ, పోలీస్ అధికారులు ఇంటర్ స్టేట్ కోఆర్డినేషన్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సరిహద్దు చెక్ పోస్టుల వద్ద ఇరు రాష్ట్రాలకు చెందిన అధికారులు సంయుక్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించాలని, అక్రమ మద్యం, నగదు, ఇతర మాదక ద్రవ్యాల రవాణా నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. సరిహద్దు ప్రాంతంలో డబుల్ ఓటర్ల జాబితా గుర్తించడం వంటి అంశాలపై తీసుకోవాల్సిన చర్యలపై ఇరు రాష్ట్రాల అధికారులు చర్చించారు. సమావేశంలో పలాస ఆర్డీఓ డాక్టర్ భరత్ నాయక్, కాశీబుగ్గ డీఎస్పీ బి.నాగేశ్వర్‌రెడ్డి, ఇచ్ఛాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.సుదర్శన్ దొర, ఇచ్ఛాపురం, సోంపేట సీఐలు ఇమ్మాన్యూల్ రాజు, హెచ్.మల్లేశ్వరరావులు పాల్గొన్నారు.



రూ.85 కోట్లతో నిర్మించిన కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రి

పలాస నుదుటన ప్రగతి సిందూరం

ఒక నాయకుడి ప్రేమ.. మరో నాయకుడి పట్టుదల. ఆ ప్రాంతాన్ని పూర్తిగా మార్చేశాయి. ఒక నాయకుడి ఉదారత. మరో నాయకుడి చతురత. ఆ ప్రాంత ప్రజల దశాబ్దాల సమస్యలకు పరిష్కారాన్ని చూపించాయి. జీడిపప్పునకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న పలాస ఇప్పుడు కిడ్నీ వ్యాధి చికిత్స కేంద్రంగా రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందుతోంది. ఆగిపోయిన ఆఫ్‌షోర్ ప్రాజెక్టుకు జీవం వచ్చింది. భూగర్భ జలం చూసి భయపడిన పల్లెలకు వంశధార నీరు అందింది. దశాబ్దాలుగా నిరీక్షించిన ఊరి దారులకు మోక్షం లభించింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ **రెడ్డి**, ఎమ్మెల్యే సీదిరి అప్పలరాజు ద్వయం కలిసి సాధించిన విజయాలివి.

- కనీవినీ ఎరుగని రీతిలో పలాసలో అభివృద్ధి
- రూ.2వేల కోట్లతో ప్రగతి పనులు
- సంక్షేమ పథకాల ద్వారా రూ.1500 కోట్ల మేర లబ్ధి

కాశీబుగ్గ:

జిల్లాలో అత్యంత కీలక ప్రాంతమైన పలాస నియోజకవర్గం కనీవినీ ఎరుగని రీతిలో ఈ ఐదేళ్లలో అభివృద్ధి సాధించింది. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవిని సైతం అధిష్టించిన డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రగతి పనుల్లోనూ అదే జోరు కనబరిచారు. చెప్పిన పనులను పూర్తి చేసి ప్రభుత్వ సాయంతో కొత్త ప్రాజెక్టులను సైతం ఏర్పాటు చేయగలిగారు. ఏకంగా రూ.2వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులు పలాసలో జరిగాయి. వీటితో పాటు సంక్షేమ పథకాల రూపంలో రూ.1500 కోట్లు సామాన్యుల ఖాతాలకు చేరాయి.



వజ్రపుకొత్తూరు మండలం గరుడభద్ర సచివాలయం

● రూ.85 కోట్లతో కిడ్నీపరిశోధన కేంద్రం

ఇప్పటివరకు జీడి పప్పు అంటే పలాస గుర్తుకువచ్చేది. ఇకపై కిడ్నీ ఆస్పత్రి అన్నా పలాసే గుర్తుకు వచ్చేలా ఇక్కడ కిడ్నీ పరిశోధన కేంద్రాన్ని ప్రభుత్వం నిర్మించి ప్రారంభించింది. రూ.85 కోట్లతో కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, డయాలసిస్ కేంద్రాన్ని నిర్మించారు. ప్రస్తుతం స్పెషలిస్టులతో పాటు మొత్తంగా 17 మంది వైద్యులు, స్టాఫ్ నర్సులు 60 మంది, డీడీఏ స్టాఫ్ 50 మంది, సపోర్టింగ్ స్టాఫ్ 20 మంది సేవలు అందిస్తున్నారు.

● జీడికి జీవం

పలాసలో 400కుపైగా జీడి పరిశ్రమలు ఉన్నాయి. ఇక్కడ రోజుకు రూ.5 కోట్ల నుంచి రూ.6కోట్ల వరకు వ్యాపారం జరుగుతుంది. అయితే ఇక్కడి వ్యాపారులకు రావాల్సిన ప్రోత్సాహకాల విషయంలో టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. వైఎస్సార్ సీపీ సర్కారు మాత్రం 2014 నుంచి 2020 వరకు రావాల్సిన జీడి ప్రోత్సాహకాలు రూ.120 కోట్లను విడుదల చేసింది. అంతేకాకుండా 60 ఎకరాల విస్తీర్ణంలో నూతన పారిశ్రామిక వాడకు సీఎం శంకుస్థాపన కూడా చేశారు.



ప్రగతి చూడండి

సీఎం వైఎస్ జగన్‌కు పలాస అంటే అత్యంత ప్రీతిపాత్రమైన ప్రాంతం . అందుకే ఇక్కడ కిడ్నీ ఆస్పత్రికి శంకుస్థాపన చేసి భవనాలను నిర్మించి ప్రారంభించారు. మూడు మండలాలు, మున్సిపాలిటీలో రోడ్ల విస్తరణ పనులు, ఆఫ్‌షోర్ పనులు పునఃప్రారంభం, రూ.800 కోట్లతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు, జీడి నూతన పారిశ్రామిక వాడకు శంకుస్థాపన, ప్రభుత్వ డిగ్రీకళాశాల ఏర్పాటుతో పాటు సుమారు రూ.2వేల కోట్లతో అభివృద్ధి పనులు చేసుకున్నాం. 60 ఏళ్లలో గౌతు కుటుంబం చేయలేని పనులు ఐదేళ్లలో చేసి చూపించాం. ఒకసారి ఇక్కడ పర్యటించి ప్రగతి పనులు చూడాలి.

– డాక్టర్ సీదిరి అప్పలరాజు, మంత్రి



శరవేగంగా నిర్మితమవుతున్న కాశీబుగ్గ ఫ్లై ఓవర్ వంతెన

పలాస నియోజకవర్గంలో పథకాలు, లబ్ధిదారుల వివరాలు..

పథకాలు	లబ్ధిదారులు	లబ్ధి.(రూ.లలో)
అమ్మ ఒడి	26,945	1,238,038,330
జగనన్న విద్యాదీవెన	16,874	343,662,847
జగనన్న వసతి దీవెన	13,494	130,582,346
విదేశీ విద్యాదీవెన	4711	82085902
రైతు భరోసా	36,165	1,629,989,930
క్రాప్ ఇన్సూరెన్స్	6,908	135,852,977
సున్నావడ్డీ పంటరుణాలు	8,659	811,428,597
ఇన్‌పుట్ సబ్సిడీ	221	756,921
మత్స్యకార భరోసా	3,755	82,000,000
వైఎస్సార్ పెన్షన్ కానుక	39,700	3,620,725,605
వైఎస్సార్ చేయూత	23,360	1,161,351,100
వైఎస్సార్ ఆసరా	50,188	1,013,342,351
సున్నావడ్డీ	62,660	127,900,247
కాపు నేస్తం	518	19,802,750
ఈబీసీ నేస్తం	377	10,120,000
కల్యాణ మస్తు	62	3,295,000
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	6,813	119,041,688
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	3,039	26,141,953
హౌసింగ్	3,949	441,838,313
వైఎస్సార్ బీమా	580	76,333,000
వాహన మిత్రా	1,564	53,095,000
నేతన్న నేస్తం	40	2,928,000
చేదోడు	1,327	31,758,000
కోవిడ్ అసిస్ట్	42,374	42,374,000
జగనన్న తోడు	4,019	19,656,487

ఊరి దారికి మోక్షం



రూ.4కోట్లతో విస్తరణ పూర్తయిన పలాస-కాశీబుగ్గ జంటపట్టణాలను కలిపే కేటీ రోడ్డు

- మంత్రి సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ప్రధాన రహదారి పనులన్నీ దాదాపు పూర్తి చేశారు.
- మున్సిపాలిటీలో కేటీరోడ్డు విస్తరణ జరిగింది.
- పలాస పట్టణంలోనే ప్రధాన దారుల విస్తరణ పనులన్నీ పూర్తి చేశారు.
- మందస పట్టణంలో ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ప్రధాన రోడ్డు విస్తరణ పూర్తి చేశారు,
- నియోజకవర్గంలో అతి పెద్ద ముఖ్యమైన బీటీ రోడ్లు రూ.21 కోట్లతో వేశారు.
- కాశీబుగ్గ-వజ్రపుకొత్తూరు 19 కిలోమీటర్ల రోడ్డు డబుల్ లైన్‌గా మార్చారు.
- రూ.19 కోట్లతో టెక్కలిపట్నం-నువ్వలరేవు రోడ్డు డబుల్ లైన్‌గా పనులు పూర్తయ్యాయి.
- రూ.9 కోట్ల ఏఎంసీ నిధులతో వంతెనలు, బీటీ రోడ్లు పూర్తయ్యాయి.

● మరికొన్ని..

- నియోజకవర్గ పరిధిలో రూ.30 కోట్లతో 70 సచివాలయాలు, వైఎస్సార్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలు నిర్మించారు.
- మంచినీళ్లపేటలో రూ12.5 కోట్లతో జెట్టీ మంజూరు చేశారు.
- పలాసకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హరిపురం, వజ్రపుకొత్తూరు, బ్రాహ్మణతర్లా మహిళా ఇంటర్ కళాశాల మంజూరు.
- రూ.18 కోట్లుతో కాశీబుగ్గ రైల్వే ఫ్లై ఓవర్ పునఃనిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.
- పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీని గ్రేడ్-03 నుంచి గ్రేడ్-02 కు అప్‌గ్రేడ్ చేశారు.
- గిరిజన గ్రామాల్లో ప్రధాన రహదారుల నిర్మాణం



● ఆఫ్‌షోర్ పునఃప్రారంభం

మహేంద్ర తనయ ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనులకు రీటెండరింగ్ వేయడంతో రూ.860 కోట్లు టెండర్ పూర్తి చేసి పనులు పునఃప్రారంభించారు. ప్రస్తుతం కుడి కాలువ పనులు ప్రారంభించారు. ఆఫ్‌షోర్ ప్రాజెక్టులో 24,600 ఎకరాలకు నీరు అందనుండగా ఒక్క కుడి కాలువ పూర్తయితే 12400 ఎకరాలకు సాగునీరు అందుతుందని అధికారులు చెబుతున్నారు. ఆఫ్‌షోర్ ప్రాజెక్టులో నీటి నిల్వ 1.860 టీఎంసీలు ఉండనుంది. అవసరార్థం కుడి కాలువ నుంచి 136 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడానికి వీలుంటుంది.



ఆఫ్‌షోర్ ప్రాజెక్టు వద్ద నిర్మితమవుతున్న కుడికాలువ పనులు

● అతిపెద్ద జగనన్న కాలనీ

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో జాతీయ రహదారి పక్కన రామకృష్ణాపురం రెవెన్యూ పరిధి, కోసంగిపురం గ్రామం వద్ద 49 ఎకరాల్లో జగనన్న కాలనీ నిర్మించారు. ఇప్పటికే వందల సంఖ్యలో నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలు సైతం పూర్తి చేశారు.




అనంతగిరి క్లస్టర్‌లో కొండపై ఏర్పాటు చేసిన మెగాట్యాంక్

● ఉపరితల జలం..

వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టులో భాగంగా పలాస నియోజకవర్గంలోని చాలా గ్రామాలకు హిరమండలం నుంచి తాగునీరు అందించే ఏర్పాటు చేశారు. కిడ్నీ వ్యాధి బాధితులకు ఇది వరం లాంటిది. ఎక్కడో హిరమండలంలోని వంశధార రిజర్వాయర్ నుంచి నీటిని ఇక్కడి వరకు తరలించారు. రూ.800 కోట్ల ఖర్చుతో ఈ కలను సాకారం చేసి ఈ ప్రాంత ప్రజల భవిష్యత్‌కు రక్షణ కల్పించారు.

● రూ.90కోట్లు తిత్లీ పరిహారం విడుదల

నియోజకవర్గం పరిధిలో తిత్లీ తుఫాన్ బాధితులకు ఈ సర్కారు రూ.90 కోట్ల పరిహారం విడుదల చేసింది. పెంచిన పరిహారం మంజూరు చేస్తానని ఇచ్చిన మాట నిలబెట్టుకుంది.



మున్సిపాలిటీ పరిధిలో కోసంగిపురం వద్ద నిర్మించిన జగనన్న కాలనీ

పోర్టులో కీలక పనులు

- మూలపేట పోర్టులో డ్రెడ్జింగ్ పనులు
- అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన షిప్‌తో పనులు
- సౌత్, నార్త్ బ్రేక్ వాటర్ మధ్యలో 19 నుంచి 25 మీటర్ల లోతు మేరకు డ్రెడ్జింగ్ చేస్తున్న షిప్

టెక్కలి: సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టులో కీలకమైన డ్రెడ్జింగ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆసియాలో అతిపెద్దదైన అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన 'వేన్‌ఫూర్డ్' గుర్తింపు కలిగిన షిప్‌తో డ్రెడ్జింగ్ పనులు చేస్తున్నారు. సౌత్, నార్త్ బ్రేక్ వాటర్ మధ్య భాగంగా సుమారు 19 నుంచి 25 మీటర్ల మేరకు లోతు చేసేందుకు రోజుకు 10 ట్రిప్‌ల మేరకు డ్రెడ్జింగ్ చేపడుతున్నారు. ఒక్కో ట్రిప్‌కు సుమారు 40 వేల టన్నుల మేరకు ఇసుకను సుమారు 5 కిలోమీటర్ల దూరంలో డంపింగ్ చేస్తున్నారు.

తుది దశకు పోర్టు పనులు

మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పనులు తుది దశకు చేరుకున్నాయని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. ఆయన ఆదివారం పోర్టును పరిశీలించి పురోగతిని తెలుసుకున్నారు. పోర్టు నిర్మాణంతో జిల్లా రూపురేఖలు మారడంతో పాటు టెక్కలి అభివృద్ధి దేశ వ్యాప్తంగా ప్రత్యేకంగా నిలుస్తుందని దువ్వాడ అన్నారు. ఈ ప్రాంతంలో సుమారు 40 ఏళ్ల రాజకీయ చరిత్ర కలిగిన కింజరాపు కుటుంబానికి ఇలాంటి అభివృద్ధి సాధ్యం కాలేదని, ఎక్కడో ఉన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టెక్కలి ప్రాంతం పై ఉన్న అభిమానాన్ని చాటుకునే విధంగా పోర్టు నిర్మాణం చేస్తున్నారని ఆయన గుర్తు చేశారు. మరి కొద్ది రోజుల్లో పోర్టు నిర్మాణం పూర్తయ్యి షిప్‌లు రాకపోకలు సాగిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయనతో పాటు పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు చింతాడ మంజు, సంతబొమ్మాళి ఎంపీపీ ఎం.రాజేశ్వరి, పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు కె.జగన్నాయకులు, సత్తారు సత్యం తదితరులు పాల్గొన్నారు.



మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పనుల పురోగతిని పరిశీలించి మాట్లాడుతున్న దువ్వాడ శ్రీనివాస్



మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టులో డ్రెడ్జింగ్ పనులు చేస్తున్న భారీ షిప్

అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకం

శ్రీకాకుళం పాతబస్టాండ్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ హాజరై అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. అంబేడ్కర్ ప్రతి ఒక్కరికీ హక్కులు కల్పించారని అన్నారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శ ప్రాయమన్నారు. ఆయన ఆశయాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకు విశ్వమోహన్ రెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్న కేశవరావు, వైద్య ఆరోగ్య శాఖ ఆయుష్ డాక్టర్ పి.జగదీష్, కలెక్టరెట్ ఏఓ కె.ఈశ్వర రావు, సాంఘిక సంక్షేమ శాఖ ఏఓ ఎస్.సమీర్‌కృష తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ ఎం.నవీన్



హిరమండలం సమావేశంలో మాట్లాడుతున్న నటుడు ఆర్.నారాయణమూర్తి

'భావితరాలకు మార్గదర్శకుడు అంబేడ్కర్'

హిరమండలం: దేశంలో భావితరాలకు మార్గదర్శకుడు బీఆర్ అంబేడ్కర్ అని సినీ నటుడు, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి అన్నారు. మండలంలోని కండరాగోలు గ్రామంలో అంబేడ్కర్ 133వ జయంతి వేడుకలు స్థానిక భీమ్‌సేన యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నారాయణమూర్తి హాజరై అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత అధికారులు రుంకు అప్పారావు, లింగాల గరికివాడు, తెప్ప పాండురంగారావు, అంబేడ్కర్-పూలే వారసుల ఐక్య వేదిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హోరెత్తిన ప్రచారం

ఎన్నికల ప్రచారాలు హోరెత్తుతున్నాయి. ఒక్క ఊరిని కూడా వదలకుండా నాయకులు చుట్టేస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలతో మమేకమవుతూ సందేశాన్ని వినిపిస్తున్నారు. మంచి చేసిన నాయకులను మళ్లీ గెలిపించాలని కోరుతున్నారు.



పొందూరు: మలకాం గ్రామంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



శ్రీకాకుళం రూరల్: కళ్లేపల్లి గ్రామంలో ప్రచార ర్యాలీలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



కాశీబుగ్గ: స్థానిక మహిళతో మాట్లాడుతున్న డాక్టర్ సీదిరి అప్పలరాజు



నరసన్నపేట: నర్సింగపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



సోంపేట: ఎన్నికల ప్రచారంలో జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ



కొత్తూరు: దొండమానుగూడ గిరిజన గ్రామంలో గిరిజన మహిళలతో కలిసి కొండ చీపుర్ల కట్టలు కడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



సంతబొమ్మాళి: ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

క్లుప్తంగా

విదేశీ విహంగాల తిరుగు ప్రయాణం



తేలినీలాపురంలో తిరిగి తమ దేశానికి వెళ్తున్న విదేశీ పక్షులు

టెక్కలి రూరల్: టెక్కలి మండలం తేలినీలాపురం గ్రామంలో గల విదేశీ పక్షుల విడిది కేంద్రంలో ఉన్న విదేశీ పక్షులు తిరిగి తమ దేశమైన సైబీరియాకు ప్రయాణమవుతున్నాయి. ఏటా సెప్టెంబర్, అక్టోబర్ మధ్యలో సైబీరియా నుంచి వేలాది కిలోమీటర్లు ప్రయాణం చేసి టెక్కలి మండలం తేలినీలాపురం గ్రామానికి వస్తుంటాయి. ఇక్కడే గుడ్లు పెట్టి ఆ పిల్లలు ఎగిరేంత వరకు ఉండి మార్చి నెలాఖరు నుండి ఏప్రిల్‌లో వెళ్లిపోతుంటాయి. ఈ ఏడాదిలో పెయింటెడ్ స్టార్క్, పెలికాన్ పక్షులు కలిసి 1003 వచ్చాయని అవి 780 పిల్లలను పొదిగి మొత్తం 1783 పక్షులు తిరిగి తమ దేశానికి వెళ్తున్నట్లు అటవీ శాఖ సిబ్బంది తెలిపారు.

కళింగాంధ్ర కవితా సంకలనం ఆవిష్కరణ



కళింగాంధ్ర కవితా సంకలనం పుస్తకావిష్కరణ

శ్రీకాకుళం కల్చరల్: తపస్వి మనోహర్, ఈవేమన కవితా నిలయం సంయుక్త నిర్వహణలో రూపొందిన కళింగాంధ్ర కవితా సంకలనం ఆవిష్కరణ ఆదివారం కేంద్ర గ్రంథాలయంలో జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పార్వతీపురానికి చెందిన బాలసాహిత్య పీఠం అధ్యక్షులు నారంశెట్టి ఉమామహేశ్వరరరావు పుస్తకావిష్కరణ చేసి మాట్లాడారు. రచయితలు తమ రచనల ద్వారా సమాజంలో ఉన్న రుగ్మతలు పోగొట్టాలన్నారు. మరో ముఖ్య అతిథి విశ్రాంత సెట్‌శ్రీ సీఈఓ సురంగి మోహనరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమారరాజు మాట్లాడుతూ మంచి కార్యక్రమాలు చేస్తున్నారని ప్రశంసించారు. సాహితీ చైతన్యకిరణాల అధ్యక్షులు బి.ఉమామహేశ్వరరావు నారంశెట్టి నిజమైన స్నేహితులు అనే కవితను ముఖ్య అతిథితో ఆవిష్కరించారు. కవితా పోటీల్లో ప్రథమ బహుమతి వచ్చిన కుప్పిలి రాజారావును ఘనంగా సత్కరించారు.

రూ.కోటి విలువైన భూమి వితరణ



స్థలదాత కిల్లారి సత్యనారాయణకు సత్కారం చేస్తున్న జై భీమ్ కమిటీ సభ్యులు, గ్రామస్తులు

జి.సిగడాం: మండలంలోని చెట్టుపొదిలాం గ్రామానికి చెందిన విశ్రాంత జిల్లా పంచాయతీ అధికారి, సీనియర్ నాయకులు కిల్లారి సత్యనారాయణ దంపతులకు జై భీమ్ సంఘం సభ్యులు ఆదివారం రాత్రి ఘన సత్కారం చేశారు. సత్యనారాయణ దళితవాడలకు చెందిన జై భీమ్ సంఘానికి రూ.కోటి విలువ చేసే 30 సెంట్లు భూమిని అంబేడ్కర్ జయంతి రోజున వితరణ చేశారు. సంఘ అధ్యక్షుడు టి.రాంబాబు, ఉపాధ్యక్షుడు ఎ.కోటీశ్వరరావు, కార్యదర్శి డి.విజయకుమార్, కోశాధికారి బి.లక్ష్మణరావులతోపాటు సభ్యులకు ఈ భూమిని అప్పగించారు. దీంతో గ్రామస్తులు, కాలనీ వాసులు కలిసి సత్యనారాయణ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూపతి సురేష్ కుమార్, ఎంపీటీసీ పట్నాన శాంతి, నాయకులు భూపతి అర్జుననాయుడు, దోల కిరణ్‌కుమార్, భూపతి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

'కుల దూషణ తగదు'



టెక్కలిలో మాట్లాడుతున్న యాదవ సామాజిక వర్గం నాయకులు

నందిగాం, టెక్కలి: శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గొండు శంకర్ తండ్రి జగపతి యాదవ కులాన్ని కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పి ఎన్నికల ప్రచారానికి వెళ్లాలని టెక్కలి నియోజకవర్గ యాదవ సంఘ అధ్యక్షుడు చిన్ని జోగారావు యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం నందిగాంలో టెక్కలి నియోజకవర్గంలోని యాదవ నాయకులతో కలసి ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జనాభా పరంగా నాలుగో స్థానంలో ఉన్న యాదవులను కించ పరిచేలా మాట్లాడిన మాజీ ఎంపీపీ గొండు జగపతి భేషరతుగా పెద్దపాడు వచ్చి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. క్షమాపణ చెప్పకుండా ఎన్నికల ప్రచారం చేస్తే అడ్డుకోవడమే కాకుండా రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకు బుద్ధి వచ్చేలా చేస్తామని హెచ్చరించారు. టెక్కలిలోనూ కొందరు సమావేశం నిర్వహించి గొండు జగపతి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

సంక్షేమం అందుకుంటే ఆశీర్వదించండి

- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు



మంత్రి ధర్మాన సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరిన కళ్లేపల్లి గ్రామస్తులు

శ్రీకాకుళం రూరల్: కళ్లేపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ఎన్నికల ర్యాలీ హోరెత్తించింది. మంత్రి ధర్మాన ప్రసాదరావు పరదేశీపాలెం నుంచి కళ్లేపల్లి వరకూ ర్యాలీ నిర్వహించారు. ముందుగా టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి స్థానిక పార్టీ నాయకులు మూకళ్ల తాతబాబు, గంగు నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో మూకళ్ల నీలంతో పాటు సుమారు 40 కుటుంబాల వారు చేరారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ సంక్షేమ ఫలాలను అందుకున్న ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకోవాలని సూచించారు. తమ ప్రభుత్వ హయాంలో 2 లక్షల ఉద్యోగాలు గ్రామ సచివాలయాల్లోనూ, 58వేల ఉద్యోగాలు వైద్యశాఖలో వేశామని గుర్తు చేశారు. అమరావతి పేరుతో ప్రజల ఆశలు అడియాసలు చేసిన వ్యక్తి చంద్రబాబు అని దుమ్మెత్తిపోశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు మాట్లాడుతూ మరోసారి టీడీపీ నాయకులు, జన్మభూమి కమిటీ సభ్యులు మంచి చేస్తామంటూ ముసుగులు వేసుకొని వస్తున్నారని వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ల చైర్మన్లు అంధవరపు సూరి బాబు, మామిడి శ్రీకాంత్, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు చిట్టి జనార్దనరావు, పార్టీ నాయకులు అల్లు లక్ష్మీనారాయణ, చిట్టి రవికుమార్, నరేంద్రకుమార్, తాతబా బు, శిమ్మ భీమారావు, కనుగుల అప్పలనాయుడు, లోలుగు శ్రీనివాసరావు, యజ్జల గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



దుర్గారావు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని చిన్నకొత్తకోట గ్రామానికి చెందిన బంటు దుర్గారావు (30) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇదే ప్రమాదంలో మరో యువకుడు దూసి గణేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. చిన్న కొత్తకోట గ్రామానికి చెందిన వీరిద్దరూ తగరపువలసలోని దివీస్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ ఇక్కడే ఉంటున్నారు. ఇదే కంపెనీలో పని చేస్తున్న స్నేహితుని వివాహానికి బైరిసింగిపురం వెళ్లిన వీరు బైక్‌పై తిరిగి తగరపువలస వస్తుండగా బొంతుపేట సమీపంలో జాతీయరహదారిపై శనివారం రాత్రి 12 గంటల సమయంలో ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి అదుపు తప్పి కింద పడ్డారు. వెనుక కూర్చున్న దుర్గారావు అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ నడిపిన గణేష్‌కు స్వల్పగాయాలయ్యాయి. దుర్గారావు తండ్రి ఆదినారాయణ ఫిర్యాదు మేరకు లావేరు ఎస్‌ఐ సీహెచ్ స్వామినాయుడు కేసు నమోదుచేశారు.

పెయింటింగ్ మేస్త్రీ ఆత్మహత్య



మృతుడు సోమేశ్వరరావు (ఫైల్)

నరసన్నపేట: మండలం గడ్డెయ్యపేట జగనన్న కాలనీలో నివసిస్తున్న పెయింటింగ్ మేస్త్రీ గండి సోమేశ్వరరావు(62) ఆత్మహత్యకు పాల్పడ్డారు. మద్యంలో పురుగుల మందు కలిపి తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక సమాచారం.
ఈ నెల 11వ తేదీ రాత్రి తన ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి వెళ్లిన సోమేశ్వరరావు ఆదివారం సాయంత్రం సత్యవరం కూడలి వద్ద ఒక చెరువు గట్టుపై శవమై కనిపించారు. ఇంట్లో మనస్పర్థలే ఆయన ఆత్మహత్యకు కారణమని తెలుస్తోంది. ఆయనకు స్థానికంగా పెయింటర్‌గా మంచి గుర్తింపు ఉంది. 11న ఇంటి నుంచి వెళ్లిన సోమేశ్వరరావు కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు పరిసర గ్రామాల్లో, బంధువుల ఇళ్లలో గాలించారు. ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం ఉదయం నరసన్నపేట పోలీసులకు సోమేశ్వరరావు కుమారుడు గిరిబాబు ఫిర్యాదు చేశాడు. ఇంతలో ఆయన మృతదేహాన్ని నరసన్నపేట పోలీసులు గుర్తించారు. మృతదేహం బాగా ఉబ్బి దుర్వాసన వస్తోంది. సోమేశ్వరరావు మృతిపై ఆయన భార్య కళావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసన్నపేట ఎస్‌ఐ అశోక్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి సంఘటన స్థలం వద్దే పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

అనుమానాస్పద రీతిలో గిరిజనుడు మృతి



సవర చంద్రయ్య మృతదేహం



సవర చంద్రయ్య (ఫైల్)

బూర్జ: మండలంలో గల మదనాపురం జంక్షన్ నుంచి బొమ్మిక గ్రామం రహదారిలో సవర చంద్రయ్య (48) అనే వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలియజేసిన వివరాలు ప్రకారం.. చంద్రయ్య బూర్జ మండలం జంగాల పాడు గ్రామానికి చెందినవారు. ఆయన శనివారం ఉదయం బంధువుల వివాహం కోసం బొమ్మిక గ్రామం వెళ్లారు. అయితే పెళ్లికి వచ్చిన వ్యక్తి తిరిగి ఇంటికి వెళ్లలేదు.

ఆదివారం ఉదయం మదనాపురం జంక్షన్ నుంచి బొమ్మిక గ్రామం రహదారిలో గల తాటి చెట్లు తోటలో విగతజీవిగా పడి ఉన్నాడు. స్థానికులు చూసి పోలీసులకు చెప్పడంతో వారు వెళ్లి మృతుడిని చంద్రయ్యగా గుర్తించారు. శనివారం సాయంత్రం నుంచే మద్యం మత్తులో పడి ఉన్నాడని, ఎవరూ పట్టించుకోకపోవడంతో మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడికి భార్య సవర పున్నమ్మ, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఆయ న మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. భార్య సవర పున్నమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ జీవీ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన టెక్నోవెర్స్



ప్రాజెక్టుల ప్రదర్శన పరిశీలిస్తున్న డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు పరిశోధనాత్మక విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎస్ఎంపురం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ అన్నారు. ఎస్ఎంపురం ఆర్జీయూకేటీ క్యాంపస్‌లో మూడు రోజులు పాటు నిర్వహించిన టెక్నోవెర్స్ టెక్నికల్ ఫెస్ట్ ఆదివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో డైరెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాలు వెలికి తీసేందుకే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. పలు కీలక అంశాల్లో పారిశ్రామిక నిపుణులు, ఐఐటీ, ఎన్ఐటీ ప్రొఫెసర్లతో వర్క్‌షాపులు నిర్వహించినట్లు చెప్పారు. పరిపాలన అధికారి మునిరామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం ఎలక్ట్రానిక్ వాహనాలు, డ్రోన్ టెక్నాలజీ, విపత్తులు ఎదుర్కోవటం, ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్, త్రీడీ టెక్నాలజీ, ఎమర్జింగ్ వంటి అంశాలపై పరిశోధనలు జరుగుతున్నాయని అన్నారు.

'దేశ సమగ్రత కాంగ్రెస్‌తోనే సాధ్యం'

శ్రీకాకుళం అర్బన్: దేశ ఐక్యత, సమగ్రత కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఏఐసీసీ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ ఎన్నికల పరిశీలకులు మనోజ్ చౌహాన్ అన్నారు. శ్రీకాకుళం పార్లమెంటు పరిధి పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులు, మండల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ వివిధ అనుబంధ సంఘాల బాధ్యులతో మనోజ్ చౌహాన్ ఆదివారం శ్రీకాకుళంలోని ఇందిరావిజ్ఞాన భవన్‌లో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గాల పరిధిలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు స్పష్టమైన హామీలు ఇవ్వాలని చౌహాన్ దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి తదితరులు పాల్గొన్నారు.

ఇది ప్రజాస్వామ్యంపై దాడి



రహదారిపై నిరసన తెలుపుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాంతోపాటు పార్టీ నాయకులు



నరసన్నపేట: నల్లబ్యాడ్జీలతో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ధర్మాన కృష్ణదాస్, తిలక్ తదితరులు



కొత్తూరు మండలం గులివిందలపేటలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



సోంపేట పట్టణంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ తడక యశోద తదితరులు

ఆమదాలవలస : సీఎం వైఎస్ జగన్‌పై దాడి అంటే ప్రజాస్వామ్యంపై దాడి చేసినట్టేనని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణ శివార్లలో నరసన్నపేట రోడ్డుపై పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం కాసేపు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ దాడితో ప్రతిపక్ష నాయకులు ఓటమిని అంగీకరించినట్టు అయ్యిందని స్పీకర్ పేర్కొన్నారు. ఒక ప్రజా నాయకుడిపై దాడికి ఉసిగొల్పడం హేయమైన చర్య అని అన్నారు. భౌతిక దాడులు వంటివి ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదన్నారు. ఇలాంటి వారిని ప్రోత్సహిస్తున్న పార్టీల గుర్తింపును ఎన్నికల సంఘం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాక్షేత్రంలో టీడీపీ కూటమికి పరాభవం తప్పదని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, మాజీ వైస్ ఫ్లోర్ లీడర్ అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు, దుంపల శ్యామలరావు, బోర చిన్నం నాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దాడిని ఖండిస్తున్నాం

నరసన్నపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై శనివారం రాత్రి జరిగిన దాడి ముమ్మాటికీ టీడీపీ దుశ్చర్యేనని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. సీఎంపై జరిగిన దాడిని ఖండిస్తూ ఆదివారం నరసన్నపేటలో నల్లబ్యాడ్జీలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సీఎంకు వస్తున్న ప్రజాదరణ చూడలేక ఇలాంటి అనైతిక చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ

సోంపేట: సీఎంపై జరిగిన దాడి ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ముఖ్యమంత్రిపై జరిగిన దాడిని ఖండిస్తూ పార్టీ నాయకులతో కలిసి సోంపేట పట్టణంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ తడక యశోద, మండల పార్టీ అధ్యక్షులు శిలగాన భాస్కరరావు, సర్పంచ్‌లు నగిరి ప్రభావతి, తడక జోగారావు, ఎంపీటీసీ పొడుగు కామేష్, తదితరులు ఉన్నారు. ముఖ్యమంత్రిపై రాయితో దాడి చేయడం దారుణమని మాజీ ఎంపీపీలు మంగిగణపతి, మంగి ధనలక్ష్మి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

'ప్రజాభిమానం చూడలేకే'

కొత్తూరు: సీఎం వైఎస్ జగన్‌కు ఉన్న ప్రజాభిమానం చూడలేకే దాడి చేశారని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. కొత్తూరు మండలం గులివిందలపేటలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి విలేకరులతో మాట్లాడారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే పట్టుకొని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు సారిపల్లి ప్రసాదరావు, జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు, కలమట రమే ష్‌బాబు,పార్టీ నాయకులు, సర్పంచ్‌లు పి.సాదుబా బు, వై.ధర్మారావు, ఎం.చక్రపాణి, నాగేంద్ర నక్క వెంకటరావు, తులసి, ఎం.శంకరరావు, లింగం, రవి కుమార్. పి.నాయుడు పాల్గొన్నారు.

'దాడి చేసిన వారిని శిక్షించాలి'

నందిగాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి చేసిన వారిని గుర్తించి తక్షణం శిక్షించాలని నందిగాంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ర్యాలీ చేపట్టారు. శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తెలుగుదేశం నాయకులు దాడిని పక్కదోవ పట్టించాలని చూస్తే ఊరుకోబోమని నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, యర్రచక్రవర్తి, పోలాకి మోహనరావు, జడ్యాడ జయరాం, కణితి నారాయణమూర్తి, చిన్ని జోగారావు, అంబోడి విష్ణు, బొమ్మాళి గున్నయ్య, పిన్నింటి జయరాం, దట్టి శాంతారావు, కూను శాంతారావు, తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రిపై దాడికి నిరసనగా ర్యాలీ చేపడుతున్న ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ తదితరులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నాగేశ్వరరావు (ఫైల్)

సోంపేట: మండలంలోని కొర్లాం–బారువ జంక్షన్ వద్ద ఆదివారం ఉదయం జరిగిన రహదారి ప్రమాదంలో మామిడిపల్లి గ్రామ పంచాయతీ రాజాం గ్రామానికి చెందిన డి.నాగేశ్వరరావు (50) మృతి చెందారు. బారువ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజాం గ్రామానికి చెందిన డి.నాగేశ్వరరావు, మామిడిపల్లి గ్రామానికి చెందిన తోట తులసీరావు వ్యక్తిగత పనులకు బైక్‌పై మండలంలోని బెంకిలి గ్రామానికి బయల్దేరారు. కొర్లాం జాతీయ రహదారి నుంచి బారువ వైపు వెళ్లే సమయంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. దీంతో నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందగా తులసీరావుకు గాయాలయ్యాయి. నాగేశ్వర రావు భార్య ఢిల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బారువ ఎస్‌ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నాగేశ్వరరావు మృతితో రాజాం గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

'ఏఓబీలో పక్కాగా తనిఖీలు'



అంతర్‌రాష్ట్ర వసుంధర చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఏసీ రామచంద్రమూర్తి

మెళియాపుట్టి: ఏఓబీ సరిహద్దుల్లో నిఘా మరింత మెరుగుపడాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) ఏసీ శ్రీరామచంద్రమూర్తి అన్నారు. ఆదివారం ఆంధ్ర, ఒడిశా సరిహద్దు వసుంధర అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. గంజాయి, నిషేధిత మద్యం, మత్తు పదార్థాల అక్రమ రవాణా జరగకుండా సిబ్బంది ప్రతి వాహనాన్ని పక్కాగా తనిఖీ చేయాలని అన్నారు. సరిహద్దుల్లో అనుమానితులుగా కనిపించే ఏ వ్యక్తినైనా వెంటనే అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసులు అప్పగించాలన్నారు. ఆయనతో పాటు పలాస ఏఈఎస్ హనుమంతరావు, సీఐ రాజశేఖర్ నాయుడు, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.